సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఇల్లు ఖాళీ చేసి వెళ్లాల్సిందే

- ప్రమాదకరంగా మురుగు కాలువలో పడితే మృతదేహం కూడా దొరకదు
- ప్రజా ప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకుని ఉంటే రూ.50 లక్షలు ఆదా అయ్యేవి
- కాలువ పైకప్ప వేయడానికి లంచం అడిగిన కాంట్రాక్టర్ - రిచ్మండ్ కాలనీ వాసులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దాదాపు ఎనిమిది కిలోమీటర్ల విస్తీర్ణం లోని పలు కాలనీల మురుగు నీటి కోసం భారీ విస్తీర్ణంలోకాలువ నిర్మిస్తున్నందున ఇల్లు ఖాళీ చేసే వెళ్లే పరిస్థితి ఏర్పడిందని రిచ్మండ్ కాలనీ ప్రజలు పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు. ఇంటి ముందు కాలువపై స్లాబు వేయమని కోరగా రూ.30 వేలు ఇస్తే వేస్తానని మున్సిపల్ కాంట్రాక్టర్ అంటున్నారని తెలిపారు. పలు రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించి చివరిలో పెద్ద కాలువ నిర్మిస్తే బాగుంటుందని,మా ఇండ్ల ముందు ఇంత పెద్ద కాలువ నిర్మించవద్దని చెప్పినా...ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు కాలువను పరిశీలించిన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, సీనియర్ నాయకులు ఎం.యాకోబు, ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వివిధ కాలనీల మీదుగా రోడ్లకు ఇరువైపులా ఒకటిన్నర అడుగుల విస్తీర్ణంలో కాలువలు నిర్మించి ఉంటే మరో ఐదు వందల కుటుంబాలకు మురుగు కాలువ సౌకర్యం ఏర్పడేదన్నారు. రూ.50 లక్షలు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదా అయ్యేదని అన్నారు. చిన్న కాలువలను అన్నిటికీ అనుసంధానం చేస్తూ చివర్లో పెద్ద కాలువ నిర్మించే నిబంధనలను ఉల్లంఘించిన ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఉన్నతాధికారుల జోక్యం చేసుకొని ప్రమాదం జరగకముందే మొత్తం కాల్వపైన స్లాబ్‌వేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీలా మార్చాలని కోరారు. ఈ పర్యటనలో సంఘం సభ్యులు సివి. వర్మ, కె. శ్రీనివాసులు, ఎ. విశ్వనాథ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'అప్పర్ భద్ర' నిర్మాణాన్ని ఆపాలి

- సిఎం వెంటనే జోక్యం చేసుకోవాలి - రైతు, ప్రజా సంఘాల డిమాండ్ - కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ఆపాలని రైతు ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని అఖిలపక్ష పార్టీలతో ప్రాజెక్టు నిర్మాణాన్ని నియంత్రించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశాయి. కర్ణాటక రాష్ట్రంలో నిర్మాణం చేస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును తక్షణమే నిలుపుదల చేయాలని ఎపి రైతు సంఘం ,ఆయా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ. కృష్ణ అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి కె. జగన్నాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పోతుల శేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, వెంకటేశ్వర్లు, రైతు నాయకులు రామకృష్ణారెడ్డి, చేతివత్తుదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.నగేష్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ స్వప్రయోజనం కోసం కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు రూ.5300 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. దాని నిర్మాణం పూర్తయితే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లాలో హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సికి నీళు లేక ఆయకట్టు పూర్తిగా సాగవడం లేదన్నారు. ఎగువన 27 టిఎంసిల సామర్థ్యంతో భద్ర ప్రాజెక్టు నిర్మించడం ఫలితంగా కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో కొత్తగా ప్రాజెక్టులు నిర్మాణం చేసినప్పటికీ నీటి లభ్యత ఉండదని అన్నారు. హంద్రీనీవా, కర్నూలు, కడప కాలువలకు నీటి లభ్యత పూర్తిగా తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ సమస్య పైన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అప్పర్‌భద్ర నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే రైతు, ప్రజాసంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతులు, రైతు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. రైతు సంఘం కర్నూలు మండల కార్యదర్శి మృత్యుంజయ కల్లూరు మండలం రైతు సంఘం నాయకులు హరిబాబు, సిఐటియు నగర నాయకులు నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నాయకులు రాధాకృష్ణ, కుమార్, వలీ, సిపిఐ ఎంఎల్ నాయకులు వెంకటస్వామి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, శేషాద్రి, డివైఎఫ్ఐ నాయకులు అంజి రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని , వారపు లక్ష్యాలు సాధించేలా మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారులు సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మంగళ వారం నుండి శుక్రవారం వరకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి, పురోగతిపై సోమవారం నాడు నివేదిక ఇవ్వాలన్నారు. ఆ మేరకు మండల స్థాయి అధికారులతో తాను సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. పురోగతి సాధించని మండలాల్లో పర్యటించి, నిర్దేశించిన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అన్ని నివాసిత ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందన సమస్యలను నాణ్యతతో, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఆప్షన్-3కు సంబంధించిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంకు సంబంధించి పనులకు సంబంధించిన ఫోటోస్ త్వరితగతిన అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్వామాకు సంబంధించి లేబర్ రేట్ పెంచేందుకు ఎపిఒలు, ఎంపిడిఒలు కృషి చేయాలన్నారు. కనిస్టెస్టెంట్ రిథమ్‌లో భాగంగా విద్యుద్దీకరణ, తాగునీరు, నాన్ ఫంక్షనల్ టాయిలెట్స్ కు సంబంధించిన మరమ్మతులను పూర్తి చేయించి వాటిని సదరు యాప్‌లో నమోదు చేయాలన్నారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డిపిఒ నాగరాజు నాయుడు, హౌసింగ్ పిడి వెంకట నారాయణ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

రూ.10 వేల వేతనం అమలు చేయాలి

- ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

స్వచ్ఛభారత్ కార్మికులకు రూ. 10 వేల వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండలం ఎంపిడిఒ ఆఫీస్ ముందు స్వచ్ఛభారత్ కార్మికులతో ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.షాజహాన్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పిఎస్ రాధాకృష్ణ, మండల అధ్యక్షులు జి శ్రీధర్ మాట్లాడారు. స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. అటువంటి కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 8 నెలలగా జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ పథకం మొదలైనప్పటినుండి రెగ్యులర్‌గా జీతాలు పడడం లేదన్నారు. ప్రతి సంవత్సరం మూడు నుంచి ఆరు నెలల జీతాలు బకాయిలో ఉన్నాయని, 2022 సంవత్సరంలో నాలుగు నుంచి ఆరు నెలల వేతనాలు పడ్డాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం రూ రూ.26000 అమలు చేయకపోగా రూ.6000 తో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. గ్రామాల్లో రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలన్నారు. నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు, రక్షణ పనిముట్లు, రిక్షా రిపేరి ఖర్చులు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి జీవో 680 ప్రకారం రూ. 10 వేల వేతనం ఇవ్వాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా కార్మికులను సమీకరించి కలెక్టరేట్‌ను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. స్వచ్ఛభారత్ కార్మికులు బజారి, గిడ్డయ్య, ఆనందు, సుగుణమ్మ, నాగరాజు, నాగ మధు పాల్గొన్నారు. **కర్నూలు (క్రైమ్)** కర్నూలు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల కార్యదర్శి నాగరాజు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సిఐటియు మండల నాయకులు హుసేనయ్య, జిల్లా కార్యదర్శి సుబాకర్ మాట్లాడారు. స్వచ్ఛభారత్ పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ ఘనంగా ఈ పథకాన్ని ప్రారంభించారని, ఈ పథకం ప్రారంభించినప్పటి నుండి గ్రామాల్లో పరిశుభ్రత ధ్యేయంగా స్వచ్ఛభారత్ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో వారి ఆరోగ్యం దెబ్బ తింటున్నప్పటికీ, ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారని అన్నారు. అలాంటి వారి బతుకులలో వెలుగు నింపాల్సిన ప్రభుత్వాలు చిత్తశుద్ధి లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. పథకం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటిదాకా రూ.20 నుండి రూ.25 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి రక్షణ కోసం ఇవ్వాల్సిన గ్లౌజులు, మాస్కులు శానిటైజర్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో కూడా పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులపై రాజకీయ నాయకులకు కూడా ఏమాత్రం ప్రేమలేదని వారిని రాజకీయంగా వేధిస్తున్నారని, పంచాయతీలో నిధులు లేవనే కారణంతో అక్రమంగా తొలగిస్తున్నారని, వారిని స్వచ్ఛభారత్ కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారికి పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల నాయకులు రాఘవేంద్ర స్వచ్ఛభారత్ కార్మికులు మద్దిలేటి, పెద్దదివల్ల నాగన్న, నాగరాజు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకష్ణ

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మార్చి 15 నుండి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరపు పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిర్వహించుకుందామని ఆర్ ఐ ఓ గురువయ్యశెట్టి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ చాంబర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అనుబంధ శాఖల అధికారులతో ఆర్ఐఒ గురువయ్యశెట్టి, డివిఇఒ జమీర్‌బాష, సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు .ఆర్ఐఒ గురువయ్యశెట్టి మాట్లాడుతూ మార్చి 15 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగు ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలుఈనెల 20 నుండి మార్చి 7 వరకు ఒకేషనల్ కోర్సులు మొదటి, రెండవ సంవత్సరపు ప్రాక్టికల్ పరీక్షలు, ఈనెల 26 నుండి మార్చి 7వ తేదీ వరకు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ జరగనున్నదని,కర్నూలు జిల్లా పరిధిలో మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్ చదువుతున్న విద్యార్థులు 17572 విద్యార్థులకు గాను,13806 మంది జంద్రల్ విద్యార్థులు 84 సెంటర్ల ద్వారా 3766 మంది ఒకేషనల్ విద్యార్థులు 27 సెంటర్ల ద్వారా పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు.ఈ పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు., పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు, రెవిన్యూ శాఖ సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, పోలీస్ శాఖ, ఏపీఎస్ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ, ట్రాన్స్కో, మునిసిపల్ శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేను అందరివాడిని : టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తాను అందరి వాడినని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 6వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ అన్ను గ్రూప్ సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరిని తాను ఆదరించి సేవ చేస్తానని చెప్పారు. తాను ఏ ఒక్క వర్గం, మతం వాడిని కాదని, తాను అందరివాడినని చెప్పారు. తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఎమ్మెల్యే అయితే స్వాతంత్రం వచ్చిన సమయం నుండి ఇప్పటివరకు ఎవ్వరూ చేయని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. కర్నూలును ఎలా అభివృద్ధి చేయాలో తనకు ఒక ప్రణాళిక ఉందన్నారు. ప్రజలు కులమతాలు చూడకుండా తనను గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశం ఇచ్చి తన పాలన చూడాలని కోరారు. పార్టీలో చేరిన మన్సూర్, జహంగీర్, షెక్షా, చాంద్, ఖాజా, శాలు, వార్డు ఇంచార్జి ఇబ్రహీం, టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాజకీయ నాయకులతో, అధికారులతో కలెక్టర్ పి. కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలయిన నేపథ్యంలో.. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కడప- అనంతపురం- కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఈ నెల 9న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని.. అదే రోజు నుండి జిల్లాలో ఎన్నికల నియమ నిబంధనలు (ఎన్నికల కోడ్) అమలులోకి వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో శాంతి యుత వాతావరణంలో పారదర్శకంగా, నిర్భయంగా, సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఏ ఒక్కరూ కూడా ఉల్లంఘించరాదని తెలిపారు. జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, వీడియో వీక్షణ, అకౌంటింగ్ బందాలతో పాటు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. నోడల్ అధికారులు, సెక్టోరల్, జోనల్ అధికారులను కూడా నియమించామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 74 పోలింగ్ స్టేషన్లను, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 27 పోలింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు లోకల్ అథారిటీస్ కు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు ఆర్డీవో కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఓటింగ్ కోసం ఓటర్ కార్డ్ లేదా 11 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. ఆయా పార్టీల ప్రతినిధుల సూచనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి, డిఆర్ఓ నాగేశ్వరరావు, కాంగ్రెస్, సిపిఎం కర్నూల్ ఓల్డ్ సిటీ , న్యూ సిటీ కార్యదర్శులు ఎం.రాజ శేఖర్, టి రాముడు, సిపిఐ నగర కార్యదర్శి రామకష్ణారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ,తెలుగుదేశం తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హాజరయిన రాజకీయ పార్టీల నాయకులు

ప్రశ్నించే గొంతును గెలిపించుకోవాలి

పత్తికొండ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించుకోవాలని, చట్ట సభలలో ప్రశ్నించే గొంతును ఎన్నుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి రంగారెడ్డి కోరారు. సోమవారం ఈశ్వర్ రెడ్డి భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టరును ప్రజా సంఘ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలపై మాట్లాడే పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు దస్తగిరి, గోపాల్, సురేంద్ర, రైతు సంఘం నాయకులు గంగన్న, వెంకటేశ్వర్లు, మస్తాన్, రమేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విజయ డైరీ కార్మికులను పనిలోకి తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విజయ పాలడైరీలో 9 మంది కార్మికులను యూనియన్ ఏర్పాటు చేసుకున్నారనే నెపంతో తొలగించారని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహించారు. విజయ పాలడైరీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్య దర్శి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంజిబాబు మాట్లాడారు. మెరుగైన సౌకర్యాల కోసం, యాజ మాన్యం నుండి రావలసిన కార్మికుల హక్కుల కోసం యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకు తొమ్మిది మంది కార్మికులను విధుల నుంచి తప్పించారన్నారు. వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను ట్రాన్స్‌ఫర్ చేయడం ఏ రకంగా న్యాయమని అన్నారు. వారికి ఇచ్చేదే తక్కువ వేతనాలని వేరే ప్రాంతంలో పోయి ఫ్యామిలీని పోషించుకోవడం ఇబ్బందికరమని అన్నారు. ఇప్పటికే లేబర్ ఆఫీసర్లకు, కలెక్టర్‌కు అనేక వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ అది .కారులు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, చేతివృత్తిదారుల సంఘం నగర కార్యదర్శి శేషాద్రి, చేతి వత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురు శేఖర్, సిఐటియు కార్యదర్శి జె.నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. రైతు సంఘం కార్య దర్శి జి.రామకృష్ణ, సిఐటియు నగర అధ్యక్ష కార్య దర్శులు నరసింహులు, సాయి బాబా, రాముడు ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదట నిరసన తెలుపుతున్న నాయకులు

పగిలిన కంభదహాల్ ఎత్తిపోతల పైప్‌లైన్, లీకవుతున్న నీరు

పగిలిన కంభదహాల్ ఎత్తిపోతల పైప్ లైన్

సంగాల పొలాల్లో కొట్టుకు పోయిన మిర్చి ధాన్యం

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ మండలం కంభదహాల్ గ్రామానికి చెందిన ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ సోమవారం పగిలిపోయింది. ఇందుకు సంబంధించిన పంపుహౌస్ కంభదహాల్‌కు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో తుంగభద్ర నది సమీపాన సంగాల దగ్గర ఉంది. పంపు హౌస్ నుండి కిలోమీటర్ దూరంలో పైప్ లైన్ పగలడంతో అందులోంచి వచ్చిన నీరు పక్కనే ఉన్న కల్లాల్లో ఉంచిన 20 క్వింటాళ్ల మిర్చి ధాన్యం కొట్టుకొనిపోయింది. ఒకే రైతు వెంకటేష్‌కు చెందిన సిజెంట 2 క్వింటాళ్లు, అరణ్య 10 క్వింటాలు కొట్టుకొని పోగా సుమారు నాలుగు లక్షలు నష్టం జరిగిందని మీడియాలో విలపించారు. మరి కొందరు రైతులవి, పక్కనే మరో రైతుల పొలాలకు ప్రమాదం తప్పింది. ఏడాదిలో ఇక్కడే ఐదు మార్లు పగిలిన పైప్ లైన్ ఇదే ప్రాంతంలో ఏడాదిలో ఐదు మార్లు పగిలిందని బాధిత రైతులు తెలిపారు. గుత్తేదారులు లక్షలు ఇచ్చినా తూతుమంత్రంగా పనులను చేసి వెళ్లిపోతున్నారని రైతులు వాపోయారు. ఇక్కడే ఎత్తిపోతల కమిటీ సభ్యులు కూడా గుత్తేదారులతో కుమ్మక్కు అవుతున్నారని, అందుకే అలా జరుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

యుటిఎఫ్ క్రిష్ణగిరి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వెల్దుర్తి : యుటిఎఫ్ క్రిష్ణగిరి మండలశాఖ నూతనకార్యవర్గం ఎన్నికైంది. సోమవారం మండలకేంద్రంలోని జడ్‌పి ఉన్నతపాఠశాలలో అధ్యక్షులు నారాయణరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సభ జరిగింది. ఈ సభలో మండల గౌరవ అధ్యక్షులుగా రామకృష్ణుడు, అధ్యక్షులుగా టి.లక్ష్మినారాయణరెడ్డి, సహాధ్యక్షులుగా వామనమూర్తి, సహాధ్యక్షురాలుగా టి.హరిత, ప్రధాన కార్యదరిగా ఎన్.దుర్గా ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్థిక కార్యదర్శిగా కె.సురేష్ , మహిళా విభాగం కన్వీనర్‌గా కృష్ణవేణి సిపిఎస్ కన్వీనర్‌గా నాగరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా యుఆర్ఎ.రవికుమార్, ఎన్‌వి.శేషారెడ్డిలుఎన్నికయ్యారు. ఎన్నికలఅధికారిగా హేమంత్‌కుమార్, పరిశీలకులుగా లక్ష్మీదేవి హాజరయ్యారు.

ఆగిన బిల్లులు.. నిలిచిన పనులు

- పని చేసినా రాని బిల్లులు - రికార్డు చేయడంలో జాప్యం

రాజా సాహెబ్ నగర్‌లో ఆగిన రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో అభివృద్ధి పనులకు నిధుల జాప్యం ఎఫెక్ట్ చూపింది. మున్సిపాలిటీ పరిధిలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు నిలిచిపోవడంతో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. 14, 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ.26 కోట్ల వ్యయం గల అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. పనులు చేపట్టేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు మొగ్గు చూపకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జనరల్ ఫండ్ కింద వచ్చే నిధుల ద్వారా అరకొరగా పనులు సాగుతున్నాయి.

పట్టణంలోని క్రాంతి నగర్ ఎక్స్‌టెన్షన్, రాజాసాహెబ్ నగర్, అమరావతి నగర్, విజయభాస్కర్ రెడ్డి నగర్, రాయ నగర్, పర్వతాపురం, శుక్రవారం పేట, వాల్మీకి నగర్, కోట వీరభద్ర స్వామి ఆలయ సమీపంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ పనులు జరగాల్సి ఉంది. ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపి నెలలు గడిచినా ఆమోదం పొందకపోవడంతో పనులు చేపట్టలేని పరిస్థితి దాపరించిందని పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

సాహసించి పని చేసినా బిల్లులు రాని పరిస్థితి

పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టి నెలలు గడిచినా బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలయ్యామంటూ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చొరవతో పనులు చేసినా ఇంతవరకు బిల్లులు రాకపోవడం వల్ల వడ్డీలు పెరిగి ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. సుమారు రూ.5 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు.

రోడ్డు వేయడం మరిచారు

పట్టణంలోని రాజా సాహెబ్ నగర్‌లో రోడ్డు, మురుగు కాలువల నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గతేడాది క్రితం పూజలు చేసి పనులు ప్రారంభించారు. కాలువలు నిర్మించి రోడ్డు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు చెబుతున్నారు. మురుగు కాలువలపై అక్కడక్కడ కల్వర్టులు నిర్మించడం వల్ల ఇళ్ల వద్దకు స్కూటర్లు వెళ్లలేని పరిస్థితి. రాత్రి వేళల్లో బైకులు, ఇతర వాహనాలు రోడ్డుపైనే వదలాల్సి వస్తోంది. రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌ను అడిగితే బిల్లు రాలేదని, అమౌంట్ వచ్చిన తర్వాతే రోడ్డు వేస్తానని చెబుతున్నారు.

రికార్డు చేయడంలో జాప్యం

టెండర్‌లో వర్కులు పొంది పనులు చేసినా రికార్డు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు సతాయిస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బిల్లులు ప్రభుత్వం ఎప్పుడైనా విడుదల చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని, చేసిన పని వివరాలు ఆన్‌లైన్‌లో చేర్పిస్తే సరిపోతుందని అడిగినా పెడచెవిన పెడుతున్నారని వాపోతున్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కలుగజేసుకొని, చేసిన పనులకు సంబంధించిన వాటిని రికార్డు చేయాలని ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓ వైపు బిల్లులు ఆగిపోయి, మరోవైపు చేసిన పని రికార్డు కాక తాము మానసిక ఆందోళనకు గురికావాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి జరిగిన పని వివరాలను రికార్డు చేయాలని కోరుతున్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

రికార్డు చేయిస్తున్నాం

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులకు సంబంధించిన వివరాలను ఇంజినీరింగ్ అధికారులతో రికార్డు చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నాం. వరుస ప్రకారం బిల్లులు మంజూరవుతున్నాయి. పెండింగ్ బిల్లులు కూడా త్వరలో మంజూరయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఎల్ఐసిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అవగాహన ఉన్న వారినే మండలికి పంపాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలపై గళమెత్తే వారినే శాసన మండలికి పంపాలని సిఐటియు నాయకులు తిప్పన్న, లక్ష్మన్న, ఎఐటియుసి నాయకులు అజయ్‌బాబు, సుదర్శన్, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్, ఎఐవైఎఫ్ నాయకులు విజయ్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసి, ఆర్అండ్‌బి కార్యాలయం, ఆర్‌టిసి డిపోలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీలైనంత మందికి తాగునీరు

- వైసిపి సీనియర్‌నాయకులు లక్ష్మికాంత్‌రెడ్డి

మాట్లాడుతున్న లక్ష్మీ కాంత్ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

కనకవీడు గ్రామంలో వీలైనంత మందికి జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా తాగునీరందించేందుకు కృషి చేస్తామని మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మీ కాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామ సచివాలయంలో సర్పంచి బి.మద్దీశ్వరి, గ్రామ కార్యదర్శి రామారావు అధ్యక్షతన జల జీవన్ మిషన్ ప్రాజెక్టుపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుళాయి ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగు నీరందించేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీటిని అందిస్తామని చెప్పారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వకుండా చేయాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి ద్వారా గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ నీటి, పారిశుధ్య కమిటీని ఏర్పాటు చేసి, 10 నుంచి 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఐఎస్ఎ స్టార్ యూత్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ మానిటరింగ్ ప్రాజెక్ట్ సమన్వయకర్త వి.భీమా శంకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుసి వెంకట్రాముడు, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాహెబ్, వైసిపి నాయకులు హరిశ్చంద్ర, పెద్దయ్య, వెంకటరాముడు, డీలర్ తిమ్మప్ప పాల్గొన్నారు.

పేదల ముసుగులో భూ కబ్జాలు

- టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ అశోక్

ప్రజాశక్తి-ఆలూరు

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

మంత్రి అనుచరులు పేదల ముసుగులో ప్రభుత్వ భూములను కబ్జాకు పాల్పడడం వాస్తవం కాదా అని టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ అశోక్ ప్రశ్నించారు. టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు సోమవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు చెరువును మంత్రి జయరాం అనుచరులు దాదాపు ఐదెకరాల భూమిని కబ్జాకు పాల్పడుతున్నది ప్రజలందరికీ తెలుసన్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలకు వైసిపి మండల కన్వీనర్ గతంలో అతనొక జర్నలిస్టు అని మరచి అధికార అహంతో జర్నలిస్టులను దూషించడం దారుణమని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆలూరు జనాభాకు అనుగుణంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలుగు యువత మండల అధ్యక్షులు మరకట్టు రాజశేఖర్, సీనియర్ నాయకులు అరికెర అంజినయ్య, కోట్ల యూత్ రాము యాదవ్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయి స్టాక్ పాయింట్‌లో తిమింగలాలు

- బియ్యం పంపిణీలో చేతివాటం - నెలకు రూ.లక్షల్లో ఆదాయం - డీలర్లకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - హొళగుంద

పేదలకు నిత్యావసర వస్తువులు అందించే ఎంఎల్ఎస్ పాయింట్‌లో అధికారులు, సిబ్బంది సరుకులను తిమింగలాల్ల దోచుకుంటున్నారు. ప్రతి నెలా రూ.లక్షల్లో అక్రమాలు జరుగుతున్న జిల్లా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో సివిల్ సప్లయి పాయింట్ నుంచి ప్రతి నెలా సరుకులను కాజేసి రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు తెలిసింది.

సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ ద్వారా 32,169 కార్డుదారులకు 5,691 క్వింటాళ్ల బియ్యం, 503.13 క్వింటాళ్ల కంది బ్యాళ్లు, 276.87 క్వింటాళ్ల చక్కెర సరఫరా చేస్తున్నారు. సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ నుంచి పంపిణీ చేసే బియ్యంలో సంచికి 1 నుంచి 5 వరకు తరుగు వస్తున్నట్లు డీలర్లు పేర్కొంటున్నారు. స్టాక్ పాయింట్‌లో తూకం చేసే స్టేజ్-2 కాంట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో డీలర్లకు సరఫరా చేయాలి. గ్రామాలకు సరఫరా ఆలస్యంగా జరుగుతుండడంతో సివిల్ సప్లయి పాయింట్ అధికారులు తూకం చేయకుండానే సరఫరా చేస్తున్నారు. సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ ద్వారా ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాలకు సరఫరా జరుగుతోంది. 50 కిలోల సంచి నుంచి 2 కిలోల బియ్యం కోతకు గురైతే 5,691 క్వింటాళ్ల బియ్యానికి దాదాపు 227 క్వింటాళ్ల బియ్యం అక్రమాలకు గురై అయ్యే అవకాశం ఉంది. కింటాకు రూ.1000 ప్రకారం లెక్కేస్తే దాదాపు రూ.2 లక్షలు స్వాహా చేసేందుకు అవకాశం ఉంది.

తక్కువగా చూపుతున్న తూకం

డీలర్లకు తప్పని తిప్పలు

సప్లయి స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేసే బియ్యాన్ని నేరుగా ఎండియు ఆపరేటర్ ద్వారా అందిస్తారు. ఆపరేటర్ డీలర్ వద్ద తూకాలు వేసి తీసుకెళ్లారు. సప్లయి స్టాక్ పాయింట్‌లో తరుగుదల వచ్చిన బియ్యాన్ని సర్దుకోలేక డీలర్లు తిప్పలు పడుతున్నారు. తమకు తెలిసిన వారి కార్డు దారులు బియ్యాన్ని ఎండియు ఆపరేటర్లకు సర్దుబాటు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నట్లు సమాచారం.

స్టాక్ పాయింట్లపై నిఘా కరువు

అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చేతిలో అనేక సంస్థలు ఉంటాయి. పాయింట్‌లో అక్రమాలు జరుగుతాయన్న విమర్శలు వినిపిస్తున్నా అరికట్టడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు. విజిలెన్స్ శాఖ అధికారులు స్టాక్ పాయింట్ తూకాల్లో జరిగే అక్రమాలపై విచారణ చేపడితే అవినీతి బయటపడుతుందని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్

తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

- తహశీల్దార్‌కు జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి - చిప్పగిరి

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 12న ఆంధ్రజ్యోతి పత్రికలో 'చెరువు చదునాయే' అనే శీర్షికతో కథనం రాశారని, ఇందులో మంత్రి జయరాం అనుచరుని హస్తం ఉన్నట్లు రాశారని తెలిపారు. ఈ వార్త అసత్యం అనిపిస్తే పరువు నష్టం దావా వేయాలని, వైసిపి ఆలూరు మండల కన్వీనర్ తన అనుచరులతో కూర్చొని ఒక వీడియో రిలీజ్ చేశారని చెప్పారు. ఈ వీడియోలో 'ఇక నుంచి మంత్రి గురించి వార్తలు రాస్తే ఆంధ్రజ్యోతి ఎమ్‌డి రాధాకృష్ణ, కర్నూలు బ్యూరో ఇన్‌ఛార్జీ కొండప్పను బండికి కట్టుకొని ఈడ్చికెళ్తాం' అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంఘం మండల గౌరవాధ్యక్షులు బాషా, అధ్యక్షులు కృష్ణమూర్తి, మండల జర్నలిస్టులు గోవిందు, రవి, యూసుఫ్ పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు ప్రసాద్, గాదిలింగప్ప, నాగరాజు, కార్యదర్శులు ఉమాపతి, వీరభద్ర గౌడ్, సభ్యులు వీరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని చూపిస్తున్న నాయకులు

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని నారాయణపురం బీసీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కమిటీ సభ్యులు తిక్కప్ప, నాయకులు తాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. బీసీ కాలనీలో నాలుగు నెలల నుంచి విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉందని, సమస్యపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు నాయకుల దృష్టికి తెచ్చారు. స్తంభం ఎప్పుడు పడిపోతుందోనని భయంతో ఆ స్తంభానికి తాడుతో కట్టామని చెప్పారు. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నామని వాపోయారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడారు. విద్యుత్ స్తంభం పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి గ్రామ సచివాలయ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. గ్రామస్తులు సుబ్బమ్మ, రామాంజిని, నాగరాజు, రసూల్, జయన్న పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు జీవితం ఆదర్శం

- సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కమల సుజాత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సరోజినీ నాయుడు జీవితం ఆదర్శనీయమని సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కమల సుజాత పేర్కొన్నారు. సోమవారం సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సరోజినీ నాయుడు గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలని తెలిపారు. ఆమె ఆనాటి కాలంలో అనేక కష్టాలు ఎదుర్కొని స్త్రీలందరినీ చైతన్య పరిచారని చెప్పారు. ఆమె గొప్ప రాజకీయవేత్త, రచయిత్రి, గాంధీజీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు.

హుండీ డబ్బులు దొంగలించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు రోజున డబ్బులు దొంగలిస్తూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... జనవరి 31న స్వామి వారి హుండీ లెక్కిస్తున్న సమయంలో నాగరాజు అనే వ్యక్తి రూ.78 వేలు దొంగలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. దేవాలయ సహాయ కమిషనర్ వాణి ఆదేశాల మేరకు జూనియర్ అసిస్టెంట్ వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సిసి రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న అరుణ్ కుమార్

గ్రామాభివృద్ధికి కృషి

- సర్పంచి అరుణ్ కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాలు కేటాయించే నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని తెర్నేకల్లు గ్రామంలోని వడ్డే గేరిలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిసి రోడ్లు, డ్రెయినేజీ లేని కాలనీల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచే ఖర్చు చేయాలని నిర్ణయించి పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఇంజినీర్ అసిస్టెంట్ గోపాల్, వైసిపి నాయకులు కురువ ఈరన్న, రాఘవేంద్ర, నాగన్న, ఏసేపు పాల్గొన్నారు.

శనగ పంట కొనుగోలు కోసం ఆర్‌బికెలో నమోదు చేసుకోవాలి

- ఎఒ శివశంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

రబీలో సాగు చేసిన శనగ, జొన్న పంటకు మద్దతు ధర పొందాలంటే రైతు భరోసా కేంద్రానికి వెళ్లి రిజిస్టర్ చేయించుకోవాలని ఎఒ శివశంకర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని చింతకుంట ఆర్‌బికెలో విఎఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో శనగ పంటకు రిజిస్ట్రేషన్ చేపడుతున్నామని, రైతులు సంబంధిత ఆర్‌బికెలకు వెళ్లి విఎఎలు కానీ, ఎంపిఇఒలతో కానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత ప్రభుత్వం శనగ క్వింటాకు రూ.5,335 మద్దతు ధర కల్పిస్తోందని తెలిపారు. దళారులకు పంటలను అమ్మి మోసపోకూడదని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మొబైల్ నెంబరు, ఆధార్ కార్డు ఆర్‌బికెకు తీసుకెళ్లాలని తెలిపారు. ఎంపిఇఒ రవి పాల్గొన్నారు.

కొత్త వారి చూపులు అక్కడే..?

- ఆ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్ పెత్తనం... - ఏ పని కావాలన్నా ఆయనను కలవాల్సిందే..!

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

ఆ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌దే పెత్తనం... ఏ పని జరగాలన్నా ఆయనను కలిస్తే చాలు... అధికార పార్టీ వారికి ఒక రకం, ప్రతిపక్షంలో ఉన్న వారికి మరో రకమైన పంచాయితీలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నట్లు తెలిసింది. అక్కడ పని చేసే ఎస్ఐ ప్రస్తుతం వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. కొత్తగా వచ్చే వారి చూపులు ఆ స్టేషన్‌పై పడ్డాయి.

ఆదోని తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని ఇస్వి ఎస్ఐ విజయలక్ష్మి వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఆ పోలీసు స్టేషన్‌కు తాలూకా ఎస్ఐ గోపాల్ రెడ్డికి ఇన్‌ఛార్జీగా బాధ్యతలు అప్పగించారు. గత రెండేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ విజయలక్ష్మి సెలవుపై వెళ్లడంతో, కొత్త వారి చూపులు పడ్డాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఏనాడూ లేని విధంగా ఎస్ఐపై కొన్ని పత్రికల్లో వరుస కథనాలు వచ్చాయి. ఆమెను తప్పించారా లేక తప్పుకున్నారా అన్న చర్చలు సాగుతున్నాయి. ఈ పోలీసు స్టేషన్‌లో ఆ కానిస్టేబుల్‌దే పెత్తనం సాగుతున్నట్లు సమాచారం. ఏ పనికి వెళ్లినా ఆయనను కలవనిదే పని కావడం లేదు. అధికార పార్టీ నాయకులకు ఒక రకం పంచాయితీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి మరో రకంగా పంచాయితీ చేస్తూ ఆయన వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. తన అరుపులకే భయపడి పోయి తాను చెప్పిన దానికే కట్టుబడి ఉండాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇక ఆ స్టేషన్ కర్ణాటక సరిహద్దు గ్రామాలను ఆనుకుని ఉండడంతో కర్ణాటక మద్యం, పేకాట, మట్కా, అక్రమ ఇసుక, రేషన్ బియ్యం వంటివి పెద్దఎత్తున సాగుతున్నట్లు సమాచారం. వాటిని సెటిల్‌మెంట్ చేయడంలో ఆయనదే పెత్తనమని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఫ్రెండ్లీ పోలీసు ఎక్కడ..?

పోలీసు స్టేషన్లలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అమలు చేస్తున్నామని ఆ శాఖ ఉన్నతాధికారులు చెబుతుండగా, ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. సమస్యలు చెప్పుకునేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం చేయకపోగా, నేతల దన్నుతో వారి ఆదేశాలను పాటిస్తూ, ఎదురు దాడులకు దిగుతున్నారు. ప్రతి ఫిర్యాదుదారునికి ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందే ఫిర్యాదు స్వీకరించినట్లు రశీదు ఇవ్వాల్సి ఉండగా, అదెక్కడా అమలు చేయడం లేదు. స్టేషన్‌కు వచ్చే వారిని పలుకరించే వారే కరువవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కొన్ని పోలీసు స్టేషన్లలో జరుగుతున్న పరిణామాలపై ఎస్పీ పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గ్రీన్ అంబాసిడర్స్ బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గ్రామాల్లో పని చేసే స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, డివిజన్ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్మికులు ఎంపిడిఒ బంగారమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చాలీచాలని జీతాలతో జీవనం కష్టమవుతోందని, అవి కూడా సరైన సమయంలో ఇవ్వకపోతే ఇంకెందుకని ప్రశ్నించారు. కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని, రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు రమేష్, రైతుసంఘం నాయకులు అబ్దుల్లా, వ్యకాస నాయకులు తిమ్మన్న, స్వచ్ఛ భారత్ కార్మికులు జయరాజు, షడ్రక్, దేవిపుత్ర, రాజన్న, శ్యామ్సన్, రాజేష్ పాల్గొన్నారు. **దేవనకొండ** ఎంపిడిఒ కార్యాలయం దగ్గర ధర్నా చేపట్టారు. స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల నాయకులు శాంతిరాజు అధ్యక్షత వహించారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్, సిఐటియు మండల నాయకులు రాఘవేంద్ర, స్వచ్ఛభారత్ కార్మికులు తిమ్మప్ప, రాముడు, మాల మధు, భార్గవ్, రాముడు, పులి పెద్రయ్య, రాముడు పాల్గొన్నారు. **ఆలూరు** ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 20న కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, శ్రీనివాసులు, బాబు, కిష్టమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆలూరు ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

వివేకా హత్య కేసు ఛేదనలో జగన్ విఫలం : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్వంత బాబాయి హత్య కేసును ఛేదించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విఫలం చెందారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నా తండ్రి, మాజీ మంత్రి వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసును రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఛేదిస్తారనే నమ్మకం లేదు. ఈ హత్య కేసును పక్క రాష్ట్రానికి బదిలీ చేయాల'ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెల్లెలు డాక్టర్ సునీతా రెడ్డి కోరి సుప్రీం కోర్టు ద్వారా కేసును పక్క రాష్ట్రానికి బదిలీ చేసుకున్నారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వంపై స్వంత చెల్లికి కూడా నమ్మకం లేదని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్యకు కడప ఎంపీ టికెట్ ప్రధాన కారణమని సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. వివేకానంద హత్యను టిడిపిపై మోపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని 'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. టిడిపి మండల నాయకులు అయ్యాలప్ప, కేశన్న, దేవదాసు, మురళీ కృష్ణారెడ్డి, ఖాజా, ప్రభుదాసు, డీలర్ ఈరన్న, రాఘవేంద్ర, సురేష్ చౌదరి, నాగరాజు, అయ్యన్న, సూర్యనారాయణ రెడ్డి, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

'ఐటిపి ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ట్రైనర్

ఇంటర్నేషనల్ టెస్ట్ ప్రిపరేషన్ (ఐటిపి) ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని భీమాస్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. సోమవారం అర్విన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో భీమాస్ కళాశాల విద్యార్థులకు ఐటిపి ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఐటిపి ప్రోగ్రామ్‌కు సంబంధించి స్కిల్స్‌పై సాఫ్ట్ స్కిల్ ట్రైనర్లు ఎంవి.రాజా ధీరజ్, కె.శివ కుమార్ రాజా విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఒడిలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆదోని
S.O.P.No. 1 /2023

Between :
1.లలిత N.గనిగెర్, W/o లేట్ జి.నీలకంఠేశ్వరప్ప
2.పల్లవి N.గునిగెర్, D/o లేట్ జి.నీలకంఠేశ్వరప్ప,
3. తనూశ్రీ N. గనిగెర్, D/o లేట్ జి.నీలకంఠేశ్వరప్ప
All are Hindu. Resident of H.No.1/541/77/1, శ్రీ రాఘవేంద్ర కాలనీ, ఆదోని-518302, కర్నూలు జిల్లా. ...పిటీషనర్స్

V/s

To whomsoever it may concern. ...రెస్పాండెంట్

జనరల్ నోటీసు టు పబ్లిక్

To
జనరల్ నోటీస్ టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా, పై తెలిపిన పిటీషనర్ నెం.1కు భర్త మరియు నెం.2 & 3 లకు తండ్రి అయిన జి. నీలకంఠేశ్వరప్ప గారు క్రింద కనపరచిన షెడ్యూలు దాఖల పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ నెం.10626362773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్, R.S. రోడ్, ఆదోని నందు పిటీషనర్స్‌కు భర్త/తండ్రి గారు అయిన జి.నీలకంఠేశ్వరప్ప పేరు మీద రూ.1,51,179-42 పైసలు వున్నది. పిటీషనర్స్‌కు భర్త/తండ్రి గారు. అయిన జి.నీలకంఠేశ్వరప్ప గారు 24-06-2021 తేదీన మరణించినారు, వీరికి పై తెలిపిన పిటీషనర్స్‌కు వారసులుగా వున్నారు. కావున, పై మొత్తమును పిటీషనర్స్‌కు తీసుకొనుటకు పై కోర్టులో సక్సెషన్ సర్టిఫికెట్ (Succession Certificate) కొరకు అర్జీ దాఖలు చేసినారు. కావున, ఎవ్వరికైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు ముందు తేది:22-2-2023 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వంతంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును. ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటీషనర్స్ పరముగా తీర్మానము చేయదురు.

SCHEDULE

Deposit amount lying in the State Bank of India, Railway Station Road, Main Branch, Adoni with the following particulars:-
SI No:- 1
Name:- late G. Neelakanteswarappa
Particulars :- Public Provident Fund
Account No. 10626362773
IFSC Code: SBIN0000801
MICR Cor: 518002202
Amount :- Rs.1,51,179-42 paise.

// కోర్టు వారి ఆర్డరు మేరకు //

వాయిదా తేది 22- 2 -2023

శ్రీ T.LV. సుబ్రహ్మణ్య శర్మ,
శ్రీ R.M. పటేల్,
శ్రీ S. విష్ణు కశ్యప్,
పిటీషనర్ తరపు వకీర్లు,
ఆదోని - 518301.

ట్రిపుల్‌ఐటి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - వేంపల్లె

అఖిల (ఫైల్‌ఫొటో)

కడప జిల్లా వేంపల్లె మండలంలోని ఆర్‌జెయుకెటి ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలో ఇ-4 చదివుతున్న ఇంజినీరింగ్ విద్యార్థిని మంగిర అఖిల (22) ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థులు, అధికారుల సమాచారం మేరకు... అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం శిబ్యాల పంచాయతీ బొగంపల్లెకు చెందిన యోగాంజనేయులు, విజయ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె అఖిల ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటిలో ఎలక్ట్రానిక్ కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతోంది. సోమవారం ఉదయం తల్లి విజయతో ఫోన్‌లో మాట్లాడిన అఖిల గదిలో ఎవరూ లేని సమయంలో కిటికీకి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొంది. విషయం తెలుసుకున్న వైస్‌ఛాన్సలర్ విజయ్ కుమార్, ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ సంధ్యారాణి సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థికి చెందిన సెల్‌ఫోన్, లాప్‌ట్యాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని వేంపల్లె ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సమస్యలతో విద్యార్థి మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తెలిసినట్లు డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. తమకు ఎలాంటి సమస్యలూ లేవని తాము కష్టపడి పిల్లలను చదివిస్తున్నామని మృతురాలి తల్లి విజయ వాపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బతుకుదెరువు కోసం అఖిల తండ్రి యోగాంజనేయులు కువైట్‌కు వెళ్లారు.రూ.90 నుంచి లభిస్తాయని తెలిపింది.

కనీస పెన్షన్ రూ.9 వేలివ్వాలి

- ఇపిఎఫ్-95 పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

కనీస పెన్షన్ రూ.9000 వేలు, దంపతులకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ పిఎఫ్ కార్యాలయాల వద్ద ఇపిఎఫ్-95 పెన్షనర్లు ధర్నా చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. గుంటూరులోని ప్రాంతీయ ప్రావిడెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎ.శాస్త్రి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకొకసారి డిఎ పెంచాలని డిమాండ్ చేశారు. మోడీ వచ్చాక పెన్షనర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. వెయ్యి రూపాయిలకు మించి పెన్షన్ రావట్లేదని, కొందరికి వందల్లో వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖలోని రీజనల్ పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.కనీస పెన్షన్ రూ.9000 వేలు, దంపతులకు వైద్య సదుపాయం, అందరికీ హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలని నినాదాలు చేశారు.

గుంటూరులో పిఎఫ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పెన్షన్‌దారులు

విజయనగరంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు ధర్నా చేశారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఎటూ చాలడం లేదని, ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అనంతరం పిఎఫ్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పిఎఫ్ రీజినల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 1వ తేదీనే పింఛను ఇవ్వాలని, డిఏను అమలు చేయాలని, రైలు ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని నినదించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఏలూరులో పిఎఫ్ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

పత్తికొండ సిడిపిఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దేవనకొండ మండలంలోని తువదొడ్డి గ్రామంలో అంగన్వాడి కార్యకర్త పోస్టు నియామకంలో అక్రమాలకు పాల్పడిన పత్తికొండ సిడిపిఒ ను సస్పెండ్ చేయాలని సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్నా ఆర్.మంజులకు పోస్టు ఇవ్వకుండా మంత్రి సిఫార్సు చేసిన వారికి పోస్ట్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఐసిడిఎస్ పిడి , పత్తికొండ సిడిపిఒలు అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తారన్నారు. వెంటనే అంగన్వాడీ కార్యకర్త పోస్టును ఆర్ .మంజులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆటోలపై ఇ-చలానాలు రద్దు చేయాలి

- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

విశాఖ జిల్లాలో ఆటోలపై వేసిన ఇ - చలానాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు యునియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ వివిధ అక్రమ పద్ధతుల్లో ఇ - చలానాలను ప్రభుత్వం వేసిందని, స్వయం ఉపాధితో బతుకుతున్న ఆటో డ్రైవర్లపై ఈ రకమైన దాడులు అన్యాయమన్నారు. పార్కింగ్ స్థలాలు లేకుండా నాన్ పార్కింగ్ పేరుతో వేసిన ఈ చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జివిఎంసి కమిషనర్ జోక్యం చేసుకొని పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. విశాఖ నగరంలో దాదాపుగా 60 వేల మంది ఆటో ఆధారంగా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. సరుకులు తెచ్చుకునేందుకు , ప్రయాణికులు ఆపారని రోడ్డు పక్కకి ఆటో ఆపినా ఫొటోలు తీసి ఇ - చలానాలను పంపిస్తుండడం, ఆయా కేసులకు సంబంధించి డబ్బులు చెల్లించాలని ట్రాఫిక్ పోలీసులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పటికే డీజిల్, స్పేర్ పార్టుల ధరలు, స్కూలు ఫీజులు, ఆర్‌టిఒ ఫైన్‌లు, వీటికి తోడు ఇ - చలానాలతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్ల పరిస్థితిని అర్థం చేసుకుని చలానాలను రద్దు చేయాలని కోరారు. 2021లో జిల్లా కలెక్టర్ ఇ చలానా రద్దుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పక్క రాష్ట్రాల్లో ఇప్పటికే ఇ చలానాలను రద్దు చేశారని తెలిపారు. రాష్ట్రంలోనూ ఇ చలానా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి జగన్, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి అప్పలరాజు, ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు యునియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో కలిసి సోమవారం వినతిపత్రం అందించారు. 2017 పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు. 2022 పిఆర్‌సి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసిన విధంగా 2022 జనవరి నుంచి ఎరియర్స్ చెల్లించాలని కోరారు. ఆర్‌టిసి ఉద్యోగులకు విలీనం కాకముందు చెల్లించాల్సిన వివిధ రకాల ఎరియర్స్ చెల్లించాలని పేర్కొన్నారు. చిన్నచిన్న కారణాలతో సస్పెండ్ చేసిన ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేసి, విధుల్లో చేర్చుకోవాలని కోరారు. 2017 పిఆర్‌సి బకాయిలు చెల్లిస్తామని, 2022 పిఆర్‌సి జనవరి నుంచి వర్తింపజేస్తామని, ఎస్‌బిటి, ఎస్ఆర్‌బిసి ఖాతాల్లో నిల్వ ఉన్న సొమ్ము ఉద్యోగులకు చెల్లిస్తామని సాబ్జీకి ఎమ్‌డి తెలిపారు. ఇతర బకాయిలు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందన్నారు.

732 టన్నుల కాఫీ కొనుగోలు

- లక్ష్యానికి చేరువలో జిసిసి

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాది కాఫీ కొనుగోలులో గిరిజన సహకార సంస్థ (జిసిసి) మంచి ఫలితాలు సాధిస్తోంది. ఇప్పటికే లక్ష్యంలో దాదాపు 75 శాతం చేరుకుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రయివేటు వ్యాపారుల కంటే అధిక ధరకు కొనుగోలు చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని కాఫీ రైతుకు కాస్త గిట్టుబాట అయ్యేలా జిసిసి ఎండి సురేష్‌కుమార్ ధర నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలోని కాఫీ పంటను జిసిసికి విక్రయించేలా గిరిజనులకు అవగాహన కల్పించేందుకు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ నేపథ్యంలో కాఫీని జిసిసికి అమ్మడానికే గిరిజనులు మొగ్గు చూపడంతో ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తున్నాయి. జిసిసి సిబ్బంది నేరుగా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కాఫీని సేకరిస్తున్నారు. దీంతో, 2022లో 150 టన్నుల కాఫీ కొనుగోలుకే పరిమితమైన జిసిసి ప్రస్తుత ఏడాది ఈ నెల పది నాటికి రూ.15.84 కోట్ల విలువైన 732 టన్నులకుపైగా కాఫీని కొనుగోలు చేసింది. ఇందులో పార్చ్‌మెంట్ కాఫీ 441 టన్నులు, చెర్రీ కాఫీ 291 టన్నులు ఉన్నాయి. ఈ ఏడాది వెయ్యి టన్నులకుపైగా కాఫీ కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కిలో అరబిక పార్చ్‌మెంట్ కాఫీకి రూ.270, చెర్రీకి రూ.135, రొబస్టాకు రూ.60 చొప్పున గిరిజనులకు ధర చెల్లిస్తోంది. సేకరించిన కాఫీలో దాదాపు 300 టన్నుల వరకు మార్కెట్లో జిసిసి ఇప్పటికే విక్రయించింది. గిరిజన నుంచి పూర్తి స్థాయిలో కాఫీ కొనుగోలు చేస్తామని జిసిసి అధికారులు చెబుతున్నారు.

అరకులోయలో కాఫీ పండ్లను ఏరుతున్న గిరిజన మహిళలు (ఫైల్)

సొసైటీల వారీగా జిసిసి కొన్న కాఫీ వివరాలు

సొసైటీ	కాఫీ కొనుగోలు (టన్నుల్లో)
అరకు	92.11
కాశీపట్నం	8.93
పాడేరు	211.97
పెదబయలు	21.05
ముంచంగిపుట్	14.86
జి.మాడుగుల	93.49
జికెవీధి	125.39
చింతపల్లి	164.35

వెల్దుర్తితో సరోజిని నాయుడు జయంతి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి గ్రంథాలయంలో ఈరోజు స్వతంత్ర సమరయోధురాలు, భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు జయంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారిణి కవిత భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.. స్వతంత్ర పోరాటంలో గాంధీజీ వెంట వేలాది మంది మహిళా కార్యకర్తలతో సరోజినీ నాయుడు ముందు వరుసలో ఉండి ఈ దేశం కోసం ఎంతో పోరాడారని తెలిపారు. భారత దేశ స్త్రీల ధైర్యం, తెగువ ,మేధస్సుకు, ఉత్సాహానికి సరోజినీ నాయుడు ఒక ప్రతీకని ప్రతి మహిళా ఆమెను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని కవిత భాయి తెలిపారు. గ్రంధాల సిబ్బంది గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు..

16న కార్యదర్శుల సదస్సు

- 8 కీలకాంశాలపై చర్చ!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ నెల 16వ తేదీన కార్యదర్శుల సదస్సును నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించనున్నారు. దీనికోసం ఎనిమిది కీలకాంశాలతో అజెండాను కూడా సిద్ధం చేశారు. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కీలకంగా మారిన గ్రామ, వార్డు సచివాలయాలను మరింత బలోపేతం చేసే అంశంపై కీలకంగా చర్చించనున్నారు. వారిలో సామర్థ్యాన్ని పెంపొందించడం, ఆయా సచివాలయాల ద్వారా సేవలను మెరుగుపరచడంపైనా చర్చ జరగనుంది. అలాగే ఎపిపిఎస్‌సి ద్వారా గ్రూప్-1, గ్రూప్-2, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న కార్యదర్శుల పోస్టుల భర్తీకి కూడా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. సచివాలయంలో ఫైళ్ల క్లియరెన్స్‌లో సమస్యలను అధిగమించేందుకు గానూ విభాగాల పునర్విభజనపైనా చర్చ జరగనుంది. ఇ-ఆఫీస్ ద్వారా ఫైళ్ల పరిష్కారం, ఎసిబి, విజిలెన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ, గత కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలుపైనా చర్చ జరగనుంది. వచ్చే నెలలో బడ్జెట్ భేటీలు జరగనున్న నేపథ్యంలో సమన్వయంతో ముందుకు సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు కూడా చర్చించనున్నారు. కోర్టు కేసుల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యల ఫలితాలపైనా చర్చ జరగనుంది. ఇవికాకుండా అప్పటికప్పుడు తలెత్తే ఇతర అంశాలనూ కార్యదర్శుల సదస్సులో చర్చించనున్నారు.

40 రోజులు దాటినా రైతుల ఖాతాల్లో జమకాని ధాన్యం డబ్బులు

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులను జమ చేస్తామని హామీనిచ్చిందని, ధాన్యం తొలి 40 రోజులు దాటినా రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదని ఎపి కౌలురైతు సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతులు కమీషన్ వ్యాపారస్తుల వద్ద వడ్డీ లేకుండా కొంత డబ్బు తీసుకుని కోత, కట్టేత, నూర్పిడి ఇతర ఖర్చులకు సర్దుబాటు చేసుకునేవారన్నారు. టార్గెట్ పూర్తయినా రైతులకు అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం కొనుగోలుకు పర్మిషన్ ఇవ్వాలని, రవాణా, కాటా కూలి పెంచాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మేనేజర్, రెండు జిల్లాల సిబ్బంది

క్షతగాత్రుడైన 'ప్రజాశక్తి' విలేకరికి ఆర్థిక సాయం

- గోదావరి జిల్లాల విలేకరులు, సిబ్బంది ఆధ్వర్యాన రూ.75 వేల నగదు అందజేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం (రాజమండ్రి)

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొయ్యలగూడెం ప్రజాశక్తి విలేకరి టి శ్రీనివాస్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఆ సంస్థలోని గోదావరి జిల్లాల విలేకరులు, సిబ్బంది రూ.75 వేల నగదును సోమవారం అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి... గత డిసెంబర్ 24న బైక్‌పై నల్లజర్ల నుంచి సొంత గ్రామం కొయ్యలగూడెం వెళ్తుండగా నల్లజర్ల మండలం కవులూరు శివారులో రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రాజమండ్రిలోని షన్‌షైన్ ఆస్పత్రిలో చేర్చగా తలకు ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో కొంత సొమ్ము అందజేశారు. చికిత్సకు పెద్దఎత్తున ఖర్చు కావడంతో పాటు శ్రీనివాస్ కోలుకోవడానికి కొంత సమయం పట్టే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజాశక్తి రాజమండ్రి (గోదావరి) ఎడిషన్ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది, విలేకరులు ముందుకొచ్చి రూ.75 వేలు ఆర్థిక సాయం అందించారు. సోమవారం శ్రీనివాస్‌ను పరామర్శించిన ప్రజాశక్తి బృందం ఆ నగదును కుటుంబ సభ్యులకు అందజేసింది. పరామర్శించిన వారిలో ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయ కమిటీ కన్వీనర్లు ఎన్ పావనమూర్తి, వివిఎస్ఎస్‌వి ప్రసాద్, ఎడివిటి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి పి నారాయణరాజు, స్టాఫ్ రిపోర్టర్ గంగరాజు, సిఐటియు నాయకులు ఎస్ రాంబాబు, ఎ దుర్గారావు ఉన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

నేడు, రేపు అన్నమయ్యకు సంగీత, నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో కర్నూలు లలిత కళా సమితిలో అన్నమయ్యకు సంగీత, నృత్య నీరాజనం నిర్వహించనున్నట్లు కన్వీనర్లు జె ఎన్ శేషయ్య, జె.రంగస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం సంగీత, నృత్య ప్రదర్శనలు, అన్నమయ్య కీర్తనలు, బుధవారం కోలాటం, సంగీత, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.


వెల్దుర్తిలో ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు నాయకులు

జర్నలిస్టుల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-వెల్దుర్తి

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అబ్దుల్ కలామ్ కు జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు అమీర్, చంద్రశేఖర్, రాజశేఖర్, దస్తు, హనుమంతులు పాల్గొన్నారు.

మద్దికెర: జర్నలిస్టులను అనుచిత వ్యాఖ్యలతో దూషించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మద్దికెర తహశీల్దార్ నాగరాజుకు సోమవారం సీనియర్ విలేకరులు తిక్కన్న, వీరశేఖర్‌ల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టులు మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఆంధ్రజ్యోతి పత్రికలో చెరువు చదునాయే అనే శీర్షికతో కథనం ప్రచురించారు. ఈ కథనంలో ఆలూరు పట్టణంలో మంత్రి జయరాం అనుచరుడు హస్తం ఉన్నట్లు రాశారు. ఈ వార్త అసత్యం అనిపిస్తే పరువు నష్టం దావా వేయవచ్చు కానీ ఆలూరు వైఎస్ఆర్ మండల కన్వీనర్ తన అనుచరులతో కూర్చుని ఒక వీడియో రిలీజ్ చేయడం, ఈ వీడియోలో ఇకనుంచి మంత్రి గురించి వార్తలు రాస్తే ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ, కర్నూలు బ్యూరో ఇన్చార్జ్ కొండప్ప లను బండికి కట్టుకొని ఈడ్చుకెళ్తాం అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు సుల్తాన్, బాబు, చంద్ర తదితర విలేకరులు పాల్గొన్నారు

పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజును గెలిపించాలి

ప్రజాశక్తి-తుగ్గలి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీరాములు, రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి కొండారెడ్డి అన్నారు. సోమవారం తుగ్గలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. పోతుల నాగరాజు ఇంటర్మీడియట్ స్థాయి నుంచి విద్యార్థి నాయకుడిగా విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు చేశారన్నారు. వీటి కోసం 1990 సంవత్సరంలో 16 రోజులు, 1990 ర్యాగింగ్ వ్యతిరేక ఉద్యమంలో మూడు రోజులు, 1997లో సంక్షేమ హాస్టల్ రద్దుకు వ్యతిరేక ఉద్యమం కోసం రెండు రోజులు, 2013 సమైక్యాంధ్ర ఉద్యమంలో నాలుగు రోజులు జైలుకు వెళ్లారన్నారు. అటువంటి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు. పట్టుబద్ధరులు ఆలోచించి పిడిఎఫ్ అభ్యర్థికి తమ ఓటును వేయాలని వారు కోరారు. సిఐటియు మండల కార్యదర్శి ప్రతాపు,డివైఎఫ్ఐ నాయకులు ఎల్లప్ప, సిపిఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చదరంగంలో సాధన మేధాశక్తి పెంపు

- జిల్లా ఒలంపిక్ కార్యదర్శి జి.శ్రీనివాసులు
- ముగిసిన జిల్లాస్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి-కర్నూలుస్పోర్ట్స్

విద్యార్థులు క్రమం తప్పకుండా చదరంగ సాధన చేస్తే మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయికృష్ణ డిగ్రీ కాలేజ్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎన్ చెస్ ఫౌండేషన్, ఆల్ కర్నూల్ డిస్టిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు ముగిశాయి. ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో అనేక పోటీలను నిర్వహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, చదరంగం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవింద జీయర్, రామసుబ్బారెడ్డి, పోటీల నిర్వాహకులు శ్రీనివాస్, సుజాతలు గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు వ్యక్తిగత ట్రోఫీలను అందజేశారు. పత్తికొండ క్రీడాకారులు మొదటి స్థానం సాధించగా, రెండవ స్థానం కర్నూలు క్రీడాకారులు నిలిచారు. మూడో స్థానంలో నంద్యాల క్రీడాకారులు నిలిచినట్టు నిర్వాహక కార్యదర్శి రామ సుబ్బారెడ్డి తెలిపారు.

ట్రోఫీలను అందజేస్తున్న అతిథులు

ఎస్‌ఐ నమూనా పరీక్షకు విశేష స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నిరంతరం సాధన చేయడం ద్వారా జీవితంలో ఏదైనా సాధించవచ్చును అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు ప్రదీప్ అకాడమీ డైరెక్టర్ సాయి ప్రదీప్ లు అన్నారు. సోమవారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నమూనా సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఐ పరీక్షలు కర్నూలు నగరంలో ఎస్‌విఆర్ కోచింగ్ సెంటర్ ప్రదీప్ అకాడమీలో సోమవారం నిర్వహించారు. ఎస్‌విఆర్ కోచింగ్ సెంటర్ల నమూనా ప్రశ్న పత్రాలను జిల్లా సహాయ కార్యదర్శి బీసన్న, జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్‌లు ఆవిష్కరించగా ,ప్రదీప్ అకాడమీలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రదీప్ అకాడమీ డైరెక్టర్ సాయి ప్రదీప్, ఎఐఎస్ఎఫ్ జిల్లా శరత్ కుమార్లు పాల్గొన్నారు. శ్రీనివాసులు, సాయి ప్రదీప్ మాట్లాడుతూ ఏ పోటీ పరీక్ష అయిన నమూనా పరీక్ష రాయడం వల్ల మెలకువలు తెలుసుకుని సమయం వృధా కాకుండా ధైర్యంగా రాయగలుగుతారన్నారు. ఫ్యాకల్టీ చేయనివారు డైరెక్ట్ మెయిన్ ఎగ్జాంపుల్ ఓఎంఆర్ సీట్లు పిబ్లింగ్ చేయడంలో, తప్పులు చేయకుండా సమాధానం రాసేందుకు వీలవుతుందన్నారు. కర్నూలు నగరంలో ఎస్‌విఆర్ కోచింగ్ సెంటర్‌లో 170 మంది అభ్యర్థులు, ప్రదీప్ అకాడమీ నుంచి 80 మంది ఎస్ఐ పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఇనామ్ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి తుగ్గలి

మండలం పరిధిలోని శభాష్‌పురం గ్రామంలో సర్వేనెంబర్ 88లో ఉన్న బూజుగుండ్ల రంగస్వామి ఇనాం భూమిని ఆక్రమించుకున్న శంకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తుగ్గలి లో సర్వేయర్ గాదిలింగప్పకు, సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్ల క్రితం శభాష్‌పురం గ్రామంలో బూజు గుండ్ల రంగస్వామికి అప్పటి పెద్దలు భూమిని ఇచ్చారన్నారు. అదే భూమిని ఆ గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి ప్రభుత్వం నిర్మించిన చెత్తాచెదారం కేంద్రం ఆక్రమించుకున్నారని, దీంతో గ్రామపంచాయతీ చెత్తాచెదారాన్ని వేయడానికి చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇదే నెంబర్ సర్వేలో ప్రభుత్వం స్వచ్ఛభారత్ షెడ్డు, బోరు, ఉపాధి హామీ పథకం కింద వాటర్ షెడ్ డ్యామ్, ఇంకుడు గుంతలు తదితర పనులు చేశారన్నారు. వాటన్నిటినీ ఆ గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి సాగు చేసుకోవడానికి అనుకూలంగా మార్చారన్నారు. గతంలో ఆర్‌ఐకి, విఆర్ఓకి ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి. బూజుగుండ్ల రంగస్వామి ఇనాం భూములను కాపాడలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాములపాడు

ఈనెల 16వ తేదీన పాములపాడు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సరోజినీ వర్జినయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిం చనున్నట్లు ఎంపిడిఒ సుమిత్రమ్మ సోమవారం తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ఆ శాఖల మండల స్థాయి అధికారులు తమ మూడు నెలల ప్రగతి నివేదికతో హాజరుకావాలని ఆమె సూచించారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు ,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

స్వచ్ఛభారత్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండ సేవలు అందిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డిఆర్ఒ పుల్లయ్యకు సమస్యల వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, స్వచ్ఛ భారత్ కార్మికుల సంఘం నాయకులు సుబ్బరాయుడు, దేవదాసులు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్వచ్ఛభారత్ కార్మికులపై నేటికీ రాజకీయ వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రెండు సంవత్సరాల క్రితం వేతనాలు పెంచుతూ జీవో నెంబర్ 680 ప్రభుత్వం జారీ చేసిందని, నేటికీ ఆ జీవో ప్రకారం పది వేల వేతనం అమలు కావడం లేదని విమర్శించారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, సబ్బులు, నూనె, యూనిఫారం, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవదాసు, సుభద్రమ్మ, ప్రసాద్, నాగన్న, హనుమంతు, త్యాగరాజు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

స్పందన వినతులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో పెండింగులో వున్న కోర్టు కేసులను నేరుగా కౌంటర్ ఫైల్ చేయకుండా జిల్లా కేంద్రంలోని పైఅధికారుల ఆమోదం తీసుకొని కౌంటర్ ఫైల్ చేయాలన్నారు. కోర్టు ఉత్తర్వులను కూడా వెంటనే అమలు పరచేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలపై కూడా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించి యాక్షన్ టెక్ అండ్ రిపోర్ట్లు నాణ్యతతో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఐపీఆర్ఓ జయరావును ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల తరపున పోరాడే వారికి

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు
- మద్దతుగా ప్రజా సంఘాలు విస్తృత ప్రచారం

మాట్లాడుతున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రజా సమస్యలపై స్పందించి, పోరాడే వారికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు అన్నారు. సోమవారం బేతంచర్లలో వామపక్ష నాయకులు ఎల్లయ్య వైబి వెంకటేశ్వర్లు, డోన్ నాయకులు శివరాం, నాగమద్దయ్య రామాంజనేయులుతో కలిసి సరస్వతి డిగ్రీ కళాశాల, వివేకానంద, తదితర కళాశాల పాఠశాలలో పనిచేస్తున్న వారిని కలిసి పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పోతుల నాగరాజు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు బ్రోకర్గా పని చేస్తూ దేశాన్ని ప్రభుత్వ సంస్థలను కట్ట పెట్టాలని ప్రయత్నం జరుగుతుందన్నారు. పెద్దల చట్ట సభలకు పేదల పక్షాన నిలబడి పోరాడే వ్యక్తిని గెలిపించడానికి సహకరించాలన్నారు. డోన్ నియోజకవర్గం వామపక్షాల నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, శివరాం, రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకూ పోరాడే వ్యక్తికి పట్టభద్రుల ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క మేధావి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగ మద్దయ్య, ఎస్సే కలాం, బాలయ్య, నరసింహారెడ్డి, రాజబాబు, బాలకృష్ణ, మాలిక్ బాష, వెంకట్ రాముడు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అభ్యుదయ వాది, ప్రజా నాయకుడు పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో సిఐటియు నాయకులు రత్నమయ్య, బీసీ నాయకులు రఘురాం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను అభ్యర్థించారు. సిఐటియు నాయకులు రాజు, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** పోతుల నాగరాజుని శాసన మండలి ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రచారం నిర్వహించాయి. పిడిఎఫ్ బల పరిచిన అభ్యర్థులను గెలిపిస్తే సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తారని సంఘాల నాయకులు అన్నారు. ప్రజాసంఘాల నాయకులు భాస్కర్, వెంకటాద్రి, శివకృష్ణ యాదవ్,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టుబద్రుల శాసన మండలి స్థానాలకు పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, సిఐటియు జిల్లా నాయకులు ఏ రణధీర్, బి రామ్ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్ కోరారు. సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని దుద్యాల, నందికుంట, కొత్తపల్లి, శివపురం, ముసలమడుగు, గోకవరం పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- పలువురు బాధితులు జిల్లా ఎస్పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వ్యక్తిగత బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని ఒకరు, పనులు చేసుకోవడానికి జెసిబి ఇప్పిస్తానని మరొకరు, ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇంకొందరు నమ్మబలికి సొమ్ము తీసుకొని మోసం చేశారని, వారి నుండి తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం బొమ్మల సత్రం దగ్గర ఉన్న జిల్లా ఎస్పి కార్యాలయంలో పోలీసు స్పందన నిర్వహించారు. స్పందించిన జిల్లా ఎస్పీ విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని బాధితులకు భరోసా కల్పించారు. ప్రతి సోమవారం ప్రతి పోలీసు స్టేషన్, సర్కిల్ ఆఫీసు, డిఎస్పి ఆఫీసులలో స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా పోలీసు కార్యాలయానికి సంబందిత సమాచారం అందించాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదిదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి రాకుండా తమ ఫిర్యాదులను వాట్సాప్ ద్వారా గానీ, ఫోన్ నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం 9154987020 నంబర్కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పి తెలిపారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 'మా చిన్నాన్న బాలగంగాధర్ రెడ్డితో కలిసి నంద్యాల పట్టణం బొమ్మలసత్రానికి చెందిన తెల్లాకుల మద్దిలేటి, తెల్లాకుల సన్నన్న కలిసి నా తండ్రి సంతకాలతో ఫోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. న్యాయం చేయండి' అంటూ భూపనపాడు గ్రామానికి చెందిన సిద్ధం సురేష్ ఫిర్యాదు చేశారు.
- 'ఇండియన్ బుల్స్ కంపెనీ మాది బెంగళూరు, హైదరాబాదులో ఆఫీసులో ఉన్నాయని, పర్సనల్ లోను 5 లక్షల దాకా ఇస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులకు పలు దఫాలుగా 67 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా పంపాను. ఇంత వరకు లోన్ ఇవ్వకుండా ఇంకా రూ.37 వేలు ఇస్తేనే లోన్ ఇస్తామని మోసం చేస్తున్నారు' అని నందివర్గం గ్రామానికి చెందిన ఎస్ .వెంకటరమణ విన్నవించాడు.
- 'పనుల కోసం జెసిబి ప్రొక్లైన్లు ఇప్పిస్తానని పలుకూరు గ్రామానికి చెందిన టి.రామకృష్ణ రూ.50 వేలు డబ్బులు తీసుకొని జెసిబిలు పంపకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు' అని గోరుకల్లు గ్రామానికి చెందిన రామ్మోహన్ ఎస్పికి ఫిర్యాదు చేశారు.

బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పి

ఆర్జిఎం విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని నెరవాడ గ్రామ సమీపాన వున్న ఆర్జిఎం కళాశాల మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థి అజ్మతుల్లా ఖాన్(20) కళాశాల హాస్టల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన మాబుఖాన్ దంపతులు ప్రస్తుతం కర్నూలులో నివాసముంటున్నారు. మాబుఖాన్ కోసిగిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. కుమారుడు అజ్మతుల్లా ఖాన్ ఆర్జిఎం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం హాస్టల్లో ఉంటూ చదువుతున్నాడు. ఈ నెల 10వ తేది అనారోగ్య కారణాల వల్ల కళాశాలకు హాజరు కాలేనని సెలవు చీటీ రాసి జేబులో పెట్టుకున్నాడు. మరుసటి రోజు ఉదయం హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. విషయం కళాశాల యాజమాన్యానికి తెలిసిన వెంటనే విద్యార్థినిశాంతి రామ్ హాస్పిటల్కు తరలించారు. కోలుకోలేక మృతి చెందాడు. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి వుంది. ఎస్ఐ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

హజ్ సేవా కేంద్రం సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - నంద్యాల: ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లాలనుకునే నంద్యాల జిల్లా ముస్లిం వాసులు నేషనల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత హజ్ సేవా కేంద్రం సేవలను ఉపయోగించుకోవాలని ఎపి శాసనమండలి సభ్యులు ఎస్.ఇషాక్ భాషా పేర్కొన్నారు. నేషనల్ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా హజ్ సేవాసమితి అధ్యక్షులు, నేషనల్ విద్యాసంస్థల అధినేత డా.యస్.ఇంతియాజ్ అహ్మద్ అధ్యర్యంలో హజ్ యాత్ర గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 10వ తేదీ చివరి తేదిగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వారు నిర్ణయించారన్నారు. యస్.ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా హజ్ యాత్రీకులకు సేవ చేసే అదృష్టం తనకు దక్కినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మౌలానా ముఫ్తీ రఫీ సాహెబ్, మహబూబ్ బాషా సాహెబ్, హాఫిజ్ అబ్దుల్ హాది, రహంతుళ్ళ, ఇద్రుస్ సాహెబ్, షరీఫ్ సాహెబ్, అబ్దుల్ సలాం, గనీ మియ్యా, అబ్దుల్ ఖదీర్ మరియు కళాశాల అధ్యాపక బందం పాల్గొన్నారు.

డోన్ ఐటిఐలో అప్రంటీస్ మేళా

ప్రజాశక్తి-డోన్

ప్రభుత్వ డోన్ ఐటిఐ కళాశాలలో అభ్యర్థులకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి వివిధ కంపెనీల హెచ్ఆర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డోన్ మునిసిపల్ చైర్మన్ సప్తసైల రాజేశ్ హాజరయ్యారు. అనంతరం వివిధ కంపెనీలలో ఎంపిక అయిన వారికి అప్రెంటిస్ అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయన కంపెనీలకు ఎంపికయిన వారు మంచి నైపుణ్యం సాధించడంతోపాటు డోన్ ఐటిఐకి మంచి పేరు తేవాలసి సూచించారు. డోన్ ఐటిఐలో మొత్తం 72 మంది ఉత్తీర్ణులు కాగా ఏడు కంపెనీల వారు 40 మందిని ఎంపిక చేసుకున్నారు.

ఐటిఐలో అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం

హంస వాహనంపై శ్రీశైలేసుడు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హంస వాహనంపై స్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. మూడవ రోజున స్వామి అమ్మ వాళ్లకు ఉదయం నుండి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవాలను దర్శించుకున్నారు. హంస వాహనంపై స్వామి అమ్మవార్లను కళాకృతులు, నృత్య ప్రదర్శనల నడుమ విద్యుత్ దీపాలు మధ్య ప్రత్యేక పూజ నిర్వహించారు. రథశాల వద్ద నుండి నంది గుడి వరకు నంది గుడి వద్ద నుండి బయలు వీరభద్ర స్వామి వరకు అక్కడి నుండి ఆలయంలోకి ప్రత్యేక గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ : దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానం విజయవాడ వారు భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు కె రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె టి భ్రమరాంబ, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి పట్టు వస్త్రాలతో ఆలయ రాజగోపాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ శ్రీశైలం దేవస్థానం అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి తదితరులు కలిసి స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారికి అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆ తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం మండపంలో వారికి వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలను, ప్రసాదాలను జ్ఞాపికలను అందజేశారు.

శ్రీశైలం వెళ్లే భక్తులకు 24 గంటలూ చెక్ పోస్టు వద్ద అనుమతి : మహాశివరాత్రిని పురస్కరించుకొని జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునే మాలధారణ చేపట్టిన శివ స్వాములకు, భక్తులకు ఆదివారం నుంచి శిఖరేశ్వరం – దోర్నాల మన్ననూర్ – దోమల పెంట చెక్ పోస్టుల వద్ద నిబంధనలు సవరించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21వ తేదీ వరకు మహాశివరాత్రి పూర్తి అయ్యేవరకు 24 గంటలు చెక్ పోస్ట్ తెరిచి ఉంటుందన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ఇరిగెల సోదరులు

శిరివెళ్లలో ఇరిగెల సోదరులు పర్యటన

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్ల మండల కేంద్రంలో సీనియర్ రాజకీయ నాయకులు ఇరిగెల సోదరులు సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. శిరివెళ్లలోని షేక్ మాలి బాషా తమ్ముడు షేక్ మున్న బాషా వలిమాకు ఇరిగెల సోదరులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల రామచంద్రా రెడ్డి, ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి, ఇరిగెల సుధాకర్ రెడ్డి, ఇరిగెల విశ్వనాథ రెడ్డి,ఇరిగెల గోపాల్ రెడ్డి ఇరిగెల దస్తగిరి రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పెసరాయి చాంద్ బాషా, బద్రి చేన్నమ్మ, బాలయ్య, రుద్రవరం మౌలాలి, రాంపల్లి రామకృష్ణ, చాగలమరి సుబ్బయ్య, నయాం భాష, ఇబ్రహీం, అలీ భాయ్ తదితరులు హాజరయ్యారు. అలాగే మంచికంటి వెంకటేశ్వర్లు, జీయో కాంప్లెక్స్ ఓనర్ కట్టెల ఇబ్రహీం తదితర కుటుంబాలను పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఈనెల 15న మండల సభ్య సర్వ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అజామ్ ఖాన్ సోమ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల కోడ్ పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం : గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో మధు సూదనరెడ్డి, ఈఓపిఆర్డి భాగ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10 నుంచి మార్చి 16వ తేదీ వరకు మండలంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏవో వరలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరాముడు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, సీనియర్ అసిస్టెంట్ షఢక్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

ప్రజాశక్తి - మహానంది : ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఈ నెల 18వ తేదీలోపు తెలియజేయాలని ఎంపీడీవో శివ నాగజ్యోతి, తాహసిల్దార్ జనార్ధన్ శెట్టి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా 12వ తేదీ నుంచి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వివేకా హత్య కేసులో జగన్ కుటుంబ పాత్ర : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

జగన్ రక్త చరిత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుటుంబం పాత్ర స్పష్టంగా బయటపడుతుందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సిఎం జగన్మోహన్ రెడ్డి రక్త చరిత్ర పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిల హస్తం ఉందని ఆరోపించారు. వైఎస్ వివేకానంద రెడ్డి, కడప ఎంపీగా పోటీ చేస్తారని తెలిసే ప్లాన్ ప్రకారం అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిలతో జగన్మోహన్ రెడ్డి హత్య చేయించారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి వివేకానంద రెడ్డి హత్యపై సిబిఐ విచారణ జరపాలని బహిరంగ సభలో మాట్లాడి అధికారంలోకి వచ్చిన తర్వాత సిబిఐ విచారణ చేసే అధికారులపై అక్రమ కేసులు బనాయించి విచారణ జరగకుండా చేశారని ఆరోపించారు. మూడున్నర సంవత్సరాలలో పినతండ్రి హత్య కేసులో ముద్దాయిలు ఎవరో తేల్చలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, నాయకులు బొబ్బల రామ మద్దిలేటిరెడ్డి, కైపా రఘునాథరెడ్డి, వేములపాడు గుర్రప్ప, వెంకటాపురం గడ్డం నాగేశ్వరరెడ్డి, పసుపల శేక్షావలి, కామేష్, పాతపాడు సంకేశ్వర రెడ్డి, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బాల అకాడమీ'లో సరోజినీ నాయుడు జయంతి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో సరోజినీ నాయుడు జయంతి కార్యక్రమాన్నిసోమవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ సరోజినీ నాయుడు ధ్వని కోకిల గానంలా ఉండేదని, అందుకే ఆమెను "భారత కోకిల" అనే వారన్నారు. పాఠశాల చిన్నారి సరోజినీ నాయుడు వేషధారణతో అందరినీ అబ్బురపరిచినది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రైవేట్ పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష హాజరై సరోజినీ దేవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమామ్ హుస్సేన్, ఉపాధ్యాయులు రమీజాబి, కరుణ, షబానా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల : సరోజినీ నాయుడు వేషధారణలో విద్యార్థిని

ఆళ్లగడ్డ : సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాటి కాపరి బేగరీల సమస్యలు పరిష్కరించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రంగమ్మ

ప్రజాశక్తి - మిడుతూరు

కాటికాపర్ల బేగరీల సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రంగమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కెవిపిఎస్ నాయకులు ఓబులేసు, లింగస్వామిల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జిఎన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రంగమ్మ మాట్లాడుతూ కాటికాపర్ల బేగరీలకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారిని నాలుగో తరగతి ఉద్యోగస్తులుగా గుర్తించి, మూడు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వారి ఆత్మగౌరవం కోసం రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, వయసుతో పరిమితం లేకుండా పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆనంద్, దాసు, కే లక్ష్మీదేవి, కమిటీ మెంబర్ శికామణి, దేవనూరు దేవన, చిన్న చెన్నయ్య, జయమ్మ, దావీదు, జయమ్మ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అవుకు

అవుకు నుండి బనగానపల్లె రోడ్డులో తిరిగే ఆటో కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షునిగా నాగాంజనేయులు, కార్యదర్శిగా బాల ఉసేనీలను ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, విజయ్ నాయక్, హుస్సేనయ్య, రహంతుల్లా, మధుసూదన్, కార్తీక్, వెంకట శివ, బాలు నాయక్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మహా శివరాత్రి సందర్భంగా పాద యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి సోమవారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలలో ఉన్న మందుల గురించి, పాద యాత్రికులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం మధ్యాహ్నం మరియు రాత్రి పూట విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత నాగలూటి వీర భద్రాలయం వద్ద వైద్య శిబిరాన్ని సందర్శించి కోనేటి నందు క్లోరినేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారులు డా.గోపాల్, డా.పవన్ కుమార్, ఎంఎల్ పి హెచ్ లు శివ, దీపిక, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్ పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ జగదీష్ చంద్ర రెడ్డి

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి : టిడిపి

ప్రజాశక్తి - బండి ఆత్మ కూర్

రాష్ట్రంలో వైసిపి పాలనకు ప్రజలు చరమగీతము పాడాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సురేష్ రెడ్డి, బైరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దదేవలాపురం గ్రామంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్ రెడ్డి సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు మాట్లాడుతూ అధిక ధరలతో బడుగు బలహీన వర్గాలు విసిగిపోయారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డిష్ రామలింగం, సర్పంచ్ పెద్దినేని పెద్దన్న, ప్రసాద్, రంగస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ప్రతిరోజు రాష్ట్ర ప్రజలపై భారాలు మోపుతున్న ఈ ప్రభుత్వా నికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు,

రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల : డోన్ ఎమ్మెల్యే రాజేంద్రనాథ్ రెడ్డిని 2024 ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని నియోజక వర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. కొమ్మూరి కొట్టాల గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టిడిపి మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి, ఎల్ల నాగయ్య మాట్లాడుతూ ఆర్థిక మంత్రి తన అనుచరులకు ఆ భూమిని బినామీ పేర్లతో సహా దత్తం చేయడం సర్వసాధారణమైపోయిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరైతే భూములు కోల్పోయిన వారికి తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండలం సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, కాకర్ల తిరుమలేశ్ చౌదరి, సుధాకర్ చౌదరి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ అధ్యక్షుడు మేకల నాగరాజు, ముస్లిం మైనార్టీ నాయకులు జాకీర్ల బేగ్, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబిన్, కౌన్సిలర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు : ఇదేం కర్మ కార్యక్రమంలో టిడిపి నేతలు

టెన్త్ టాలెంట్ టెస్ట్‌ని జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఈనెల 15వ తేదీన భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక థెరిస్సా జూనియర్ కళాశాల సెంటర్ నందు మధ్యాహ్నం రెండు నుండి నాలుగు వరకు నిర్వహించే టెన్త్ టాలెంట్ టెస్ట్‌ని జయప్రదం చేయాలని ఆత్మకూర్ ప్రైవేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి చలపతి, ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కే దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుండే మార్కులు, ర్యాంకులు,

ప్రచార పత్రాలనుచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గ్రేడులు సంపాదించి, తమ భవిష్యత్తుకు బాటలు వేసుకునే అన్వేషణలో నిమగ్నమై పరీక్షలలో పేపర్ ఎలా వస్తుందో.. అనే ఆలోచనలో ఉన్నారు. విద్యార్థులలో ఈ భయాన్ని పోగొట్టి మనోధైర్యాన్ని నిలిపేందుకు ప్రముఖ విద్యావేత్త, కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కే.ఎస్. లక్ష్మణరావు పర్యవేక్షణలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న పరీక్ష "ప్రజ్ఞ వికాస" పదవ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకో వాలని వారు అన్నారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ మీడియంల్లో ఉంటుందని, సబ్జెక్ట్ వారిగా తెలుగు - 10, ఇంగ్లీష్ - 20, హిందీ - 10, లెక్కలు - 20, ఎన్ఎస్ -10, పిఎస్ -10, సోషల్ -20, మార్కులకు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సమాచారం కొరకు 6303261839, 8790372547 ఈ నెంబర్ని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఆత్మకూర్ ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి - మహానంది

మహానందిలో కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలను, ఎద్దుల పోటీ ప్రదేశాలలో భద్రతా ఏర్పాట్లు, దేవాలయం చుట్టూ ఉన్న పరిసరాలు, రథోత్సవం నిర్వహించే ప్రదేశంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఎస్‌పిని శేష వస్త్రంతో సత్కరించి, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో ఈవో, ట్రస్టు బోర్డు చైర్మన్‌లతో కలిసి బ్రహ్మోత్సవాల సందర్భంగా

పనులను పరిశీలిస్తున్న ఎస్‌పి, ఆలయ అధికారులు

ఏర్పాట్లు, భద్రత చర్యలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్పి సి.మహేశ్వర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, నంద్యాల తాలూకా రూరల్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, మహానంది ఎస్ఐ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

16 నుండి శివరాత్రి బ్రహ్మోత్సవాలు : ఇఒ

మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 16 నుండి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆలయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ శివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణ, గణపతి పూజతో ప్రారంభమై 21వ తేదీ ధ్వజ అవరోహణతో ముగిస్తాయని తెలిపారు.

ఐపిఎల్ వేలంలో తొలి తెలుగు క్రీడాకారిణి అంజలి శర్వాణి

-రూ.55 లక్షలకు దక్కించుకున్న యుపి వారియర్స్ ఫ్రాంచైజీ

ప్రజాశక్తి-ఆదోని

మహిళ ఐపిఎల్ వేలంలో కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన జాతీయ క్రికెటర్ ఆల్ రౌండర్ అంజలి శర్వాణిని యుపి వారియర్స్ ఫ్రాంచైజీ రూ. 55 లక్షలకు కొనుగోలు చేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఐపిఎల్ వేలంలో తొలి తెలుగు క్రీడాకారునిగా అంజలి శర్వాణి నిలిచారు. అనతి కాలంలోనే జాతీయ మహిళల జట్టుకు ఎంపికై ఇటీవల ఆసీస్ సిరీస్‌లో తన సత్తా చాటుకుంది. సౌత్ ఆఫ్రికా ముక్కోణపు సిరీస్ లోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. ప్రస్తుతం జరుగుతున్న 2020 వరల్డ్ కప్ మహిళ క్రికెట్ జట్టులో ఆడుతుంది. ఆమె క్రీడా నైపుణ్యం ఫ్రాంచైజీల దృష్టిలో పడింది. ఎడమచేతి బౌలర్, పేసర్ గా రాణిస్తుంది. రు.30 లక్షల బేస్ ప్రైజ్ గా అంజలి శార్వాణిని ఐపిఎల్‌లో ఉంచారు. వేలంలో పాల్గొన్న పలు జట్లు ఆమె కోసం పోటీపడ్డాయి. చివరకు యుపి వారియర్స్ జట్టు రూ.55 లక్షలకు కొనుగోలు చేసి అంజలి శార్వాణిని దక్కించుకున్నారు. తల్లిదండ్రులు రమణ, అనురాధ , గురువు వెంకటేష్ అంజలి ఎదుగుదలతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. దేశానికి మంచి క్రీడాకారిణిగా రాణిస్తూ ఐపిఎల్‌లో తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

గోల్డ్ మెడల్ విజేతకు బిసి ఇందిరా అభినందన

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎపి స్పోర్ట్స్ అరబిక్స్ ఫిట్నెస్ ఛాంపియన్ షిప్ మెరిట్‌లో గోల్డ్ మెడల్ స్టేట్ లెవల్‌లో స్థానం సంపాదించిన క్రీడాకారిణి మధుప్రియను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిరా సోమవారం అభినందించారు. మండలంలోని తమ్మడపల్లె గ్రామానికి చెందిన వైసీ మద్దిలేటి కుమార్తె మధుప్రియ ఆళ్లగడ్డలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఎపి స్పోర్ట్స్ అరబిక్స్ ఫిట్నెస్ ఛాంపియన్ షిప్ మెరిట్‌లో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని న్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న బీసీ ఇందిరా

పశు సంపద - పశువుల వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - పాములపాడు

పశు సంపద, పశువులకు వచ్చే వ్యాధుల పట్ల సోమవారం తుమ్మలూరు గ్రామంలో పాములపాడు వెటర్నరీ సిబ్బంది ఉచిత పశు వైద్య శిభిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి అనిల్ రైతులకు పశువుల పరిరక్షణపై సూచనలు చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు. అనంతరం పశువులకు చికిత్స అందించారు. ఈ కార్యక్ర మంలో ఇంటాస్ కంపెనీ ప్రతినిధి నరసింహా రావు, స్కై ఇసి కంపెనీ ప్రతినిధి లక్ష్మణ రావు, న్యూట్రల్ రెమిడేషన్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ సిబ్బంది

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీ అధ్యక్షులుగా ఎన్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా ఎం విజయ్ కుమార్, గౌరవాధ్యక్షులుగా బి సుధాకర్, ఉపాధ్యక్షులుగా సి.కృష్ణయ్య, మహిళా మండల అధ్యక్షురాలుగా జే విజయ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్ నారాయణ, కేయం నాగరాజు ,కే మల్లికార్జున ,ఎస్ సతీష్ కుమార్, వై సుంకన్న, మండల కార్యదర్శిగా పూజారి శ్రీనివాసులు, కే గోపాల్, కే మధు కిషోర్, నరసయ్య, ఎం పుష్పలత, ఆడిట్ మెంబర్ ఏసి సన్నన్న, మండల సిపిఎస్ కన్వీనర్ ఎస్ లక్ష్మీ నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కే సత్య ప్రకాశం మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన అన్ని రకాల అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని, ప్రతినెల జీతాలు ఒకటవ తేదీన చెల్లించాలని

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

డిమాండ్ చేశారు. రానున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి - అవుకు

అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 28 వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. డోన్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు, ఎక్సైజ్ సీఐ సుభాషిణి సమక్షంలో 27 మోటార్ సైకిల్లు, ఒక కారును వేలం వేయగా రూ. 2 లక్షల 23 వేలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. **బనగానపల్లె :** పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం కేసులో పట్టుబడిన వాహనాలకు వేలం డోన్ డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి, సిఐ సుబ్బరాయుడు, సెబ్ సీఐ సుహాసినిల ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మోటారు సైకిళ్ళు 20, కారు 1, ఆటో 4 మొత్తం 25 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.1 లక్ష 07 వేల 190 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎస్సై రామిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నందివర్గం పోలీస్ స్టేషన్‌లో 3 మోటారు సైకిళ్ళను వేలం పాట నిర్వహి ంచగా 2 వాహనాలకు 51,408 రూపాయలు వచ్చినట్లు సిఐ తెలిపారు. సెబ్ సిఐ సుహాసిని, నందివర్గం ఎస్సై రామాంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వైద్యశాలపై త్రిసభ్య కమిటీ విచారణ

ప్రజాశక్తి - బేతంచర్ల

పట్టణంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో జరుగుతున్న చట్ట వ్యతిరేక లింగ నిర్ధారణ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుకుంటున్నారని స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి అడిషనల్ డిఎంహెచ్వో బాలాజీ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డిలు సోమవారం విచారణ చేపట్టారు. వైద్యశాలకు సంబంధించిన నిర్వాహకురాలు డాక్టర్ రమాదేవి ని విచారించడంతోపాటు వైద్యశాలకు ఉండవలసిన ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరింత లోతుగా విచారణ చేయవలసి ఉందని విచారణ పూర్తి అయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. వారితోపాటు ఆర్ఐ శ్రీదేవి, రంగాపురం పీహెచ్సీ వైద్యురాలు భార్గవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విచారణ నిర్వహిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం

ప్రజాశక్తి - కొత్తపల్లి

జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో కర్నూల్ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించడం గర్వకారణం అని ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తెలిపారు. సోమవారం జాతీయస్థాయి బాల బాలికల సాఫ్ట్ బాల్ పోటీల్లో రాణించిన రవి, కళ్యాణి క్రీడాకారులను మెడల్స్ శాలువాతో అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రంలోని (పూరి) ఇండోర్ స్టేడియంలో జరిగిన 44వ సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్‌లో సీనియర్ విభాగంలో ప్రథమ స్థానరో రాణించడం అభినందనీయమన్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ జట్టులో కర్నూలు జిల్లాకు చెందిన రవి, సీనియర్ బాలికల విభాగంలో కె.కళ్యాణి 5వ స్థానంలో ఉండటం జిల్లాకు గర్వకారణం అన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సాఫ్ట్ బాల్ సీఈవో వేంకటేశులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి కొమ్మువారి విజయ్, జాయింట్ సెక్రటరీ ఉమా మహేశ్వరి, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-డోన్

చైతన్య, నారాయణ, శ్రీసుధ స్కూళ్లకు జిల్లా వ్యాప్తంగా ఎల్‌కెజి, యుకెజి, నర్సరీ ఎక్కడ కూడా పర్మిషన్ లేకుండా స్కూల్ నడిపిస్తూ వేలకు వేల ఫీజులు దండుకుంటున్నారని వెంటనే అలాంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా సహాయకార్యదర్శి పవన్, డోన్ ఆర్‌డిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ పర్మిషన్ లేకున్నా అక్రమఅడ్మిషన్స్ చేస్తున్నారని, సమయం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్స్ చేస్తూ అడ్మిషన్స్ కచ్చితంగా చేయాలంటూ అక్కడ విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. గవర్నమెంట్ నిర్ణయించిన ఫీజుల కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. అలాంటి స్కూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. . లేని పక్షంలో డిప్యూటీ డిఇఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమృతరాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న పిడిఎస్‌యు నాయకులు

రియల్ ఎస్టేట్ వ్యాపారి బికె సింగ్ పై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్‌కు కౌలూరు గ్రామ వాసులు ఫిర్యాదు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని కౌలురు గ్రామ పంచాయతీలో ఉన్న జుర్రేరు సర్వే నెంబరు 400లో ఉన్న వాగు వెంట అక్రమగా మట్టిని తరలిస్తున్న బికె సింగ్ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, చెన్నయ్య, కౌలూరు గ్రామస్తులు దేవదత్తు తదితరులు సోమవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో బికె సింగ్ దాదాపు 60 నుండి 70 ఎకరాల వరకు వెంచర్ వేశారని, పంచాయతీలో ఉన్న వాగు వెంట ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. మట్టిని తీయడం వల్ల ఎస్సీ కాలనీలోకి వర్ష కాలంలో నీరు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గ్రామానికి ప్రమాదం వాటిల్లకుండా తక్షణమే బికె సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ఎపి జలవనరుల శాఖ మొద్దు నిద్ర వీడాలి

- బొజ్జా దశరథరామిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

ఎపి జలవనరుల శాఖ మొద్దు నిద్ర వీడాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ క్రియాశీలక కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఎపి జలవనరుల శాఖ ప్రధాన కార్యదర్శికి రాసిన ఉత్తరాన్ని పత్రికలకు సోమవారం విడుదల చేసి మాట్లాడారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని గత రెండు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నా, ప్రజాప్రతినిధులు ఉత్తరాలు వ్రాసినా జలవనరుల శాఖ మొద్దు నిద్రలోనే ఉందని విమర్శించారు. రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణకు కీలకమైన అంశాలు పట్ల ఇప్పటికైన ఎపి జలవనరుల శాఖ క్రియాశీలకంగా స్పందించి రాజకీయ, న్యాయ పోరాటాలకు ప్రభుత్వానికి ఆయుధాలను అందించే దిశగా కార్యాచరణ చేపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

మందలూరులో పార్వేట ఉత్సవ పల్లకి

ప్రజాశక్తి - రుద్రవరం

అహోబిల లక్ష్మీనరసింహస్వామి పారవేట ఉత్సవ పల్లకీ సోమవారం మండలంలోని మందలూరు గ్రామానికి చేరుకుంది. ఆయా తెలుపులపై స్వామి ఉత్సవమూర్తుల ఉత్సవ పల్లకి కొలువుదీరగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సగిల నిర్మల, వీఆర్వో ఫక్రుద్దీన్, గ్రామ వైసిపి నాయకుడు శ్రీనివాసరెడ్డితో పాటు సచివాలయం సిబ్బంది ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి రాత్రికి నక్కలదిన్నె గ్రామం చేరుకుంది.

పల్లకికి పూజలు చేస్తున్న దృశ్యం

నేడు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

నేడు నంద్యాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం పరిశీలిస్తున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్ బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కే. ప్రసాద్, సహాయ కార్యదర్శి జి.సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనంజయుడు, ఇన్సాఫ్ నాయకుడు మధు భాషలు తెలిపారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని మల్యాల ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, సిద్దేశ్వరం, భానకచెర్ల, వెలుగోడు ప్రాజెక్టులను పరిశీలిస్తారని చెప్పారు. జిల్లాలోని రైతాంగం, ప్రజలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

సిఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ శాసనమండలి సభ్యులుగా (ఎమ్మెల్సీ)గా నియమిస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు రామాచారి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అతి త్వరలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ సభ్యులను పూర్తి చేస్తున్న సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం విశ్వబ్రాహ్మణులకు అందులో రాయలసీమ ప్రాంతానికి ప్రాధాన్యతను ఇచ్చి సభ్యులుగా నియమించాలని కోరారు.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 16/2020
ఉలవల ఉపేంద్ర కుమార్ రెడ్డి ...వాది
V/s.
బొగ్గరపు ఫణికుమార్,
S/o. సుబ్రమణ్యం, శాంతి ఆప్టికల్స్,
ఇ.నెం. 16-57, బసవన్న గుడి ప్రక్కన,
బైరుమల్ వీధి, నంద్యాల టౌన్ & మండలం జిల్లా.
... ప్రతివాది
ప్రతివాది దావా సమను ప్రకటన
పై నెంబరు దావాలో పై తెలిపిన కోర్టులో వాది, ప్రతివాది, పై దావా మొత్తం రాగోరి దావా వేసివున్నారు. సదరు దావాలో ప్రతివాది అయిన నీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపినను ఉద్దేశపూర్వకముగా దావా సమన్లు తీసుకొననందుకు కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమను పంపుటకు ఉత్తర్వు యిచ్చివున్నారు. కావున ప్రతివాది అయిన నీకు 20-2-2023 వ తేది పై కోర్టు నందు ఉదయం 10:30 గంటలకు నీవు గాని, నీ తరపున వకీలు గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును, లేని యెడల నీ పరోక్షమున దావా తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వులతో
వాయిదా తేది : 20-02-2023
కె. సుధాంసురెడ్డి
అడ్వకేట్, నంద్యాల.
సెల్ : 6302828849